



కపిలేశ్వరపురం స్టాక్ పాయింట్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

లెక్కతేలింది

- జిల్లాలోని ఆరు స్టాక్ పాయింట్లలో 2,44,131 టన్నుల ఇసుక నిల్వలు
- నేటి నుంచి ఉచిత ఇసుక విధానం అమలు
- టన్నుకు రూ.245 చెల్లిస్తే చాలు

అమలాపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి):

నిన్నటి వరకు ఇసుకే బంగారమాయెను.. అవసరం కోసం ఎంత సొమ్ము అయినా వెచ్చించి కొందామంటే ఇసుక దొరుకుతుందో లేదో తెలియని పరిస్థితి. కోనసీమ నదీపాయల్లో దొరికే ఇసుకకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక స్థానం ఉంది. ఇసుక రీచ్‌లు కూడా ఇక్కడ ఎక్కువగా ఉన్నాయి. దాన్ని గత వైసీపీ పాలకులు అలుసుగా తీసుకున్నారు. ఎక్కడపడితే అక్కడ అనధికారికంగా ఇసుకను తవ్వేశారు. అన్ని నిబంధనలకూ పాతరేశారు. భవిష్యత్తులో ఏం విపత్తు జరుగుతుందో కూడా తెలియని విధంగా ఇసుకను దోచేశారు. ప్రభుత్వ భవనాలు, ఇళ్ల నిర్మాణాల పేరిట లారీల కొద్దీ ఇసుకను అక్రమంగా తరలించేసి దోచేశారు. వేలకు వేలు పోసినా దొరకని ఇసుకను కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు ఉచితంగా అందించేందుకు నిర్ణయించింది. ఎక్కడా అక్రమాలకు తావులేకుండా సీసీ కెమెరాల నిఘాలోనే ఇసుకను అందరికీ అందుబాటులో ఉంచే విధంగా అధికార యంత్రాంగాన్ని సైతం నియమించింది. జిల్లాలో ఉచిత ఇసుక విధానం సోమవారం నుంచి అమలు కానుంది.

అప్పుడూ ఉచితమే.. ఇప్పుడూ ఉచితమే..

ఇసుక బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించేందుకు 2016లో చంద్రబాబు ప్రభుత్వం ఇసుకను ప్రజలకు ఉచితంగా అందించింది. అప్పటి ప్రభుత్వ నిర్ణయంతో అందరికీ ఇసుక అందుబాటులో ఉండడమే కాకుండా చౌకగా లభించేది. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత ఇసుక విధానాన్ని తుంగలోకి తొక్కింది. వేలకు వేలు సొమ్ము చెల్లించినా ఇసుక దొరకని పరిస్థితి తీసుకురావడంతో భవన నిర్మాణరంగం పూర్తిగా కుదేలైంది. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడమే కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈ నెల 8 నుంచి ఉచిత ఇసుక పాలసీ అమలు చేసేందుకు నిర్ణయించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఇక ఇసుక కష్టాలు తీరుతాయని భవన నిర్మాణ కార్మికులతో పాటు సామాన్యులు సైతం భావిస్తున్నారు. ఉచిత ఇసుక విధానంతో ఉపాధి కరువైన భవన నిర్మాణరంగ కార్మికులకు మళ్లీ చేతినిండా పని దొరికి భవన తిరిగి ఊపందుకుంటుందని ఎంతో ఉత్సాహంగా చెప్తున్నారు.

టన్నుకు రూ.245 వసూలు

జిల్లాలోని అన్ని స్టాక్ పాయింట్లలోనూ ఇసుకను ఉచితంగా అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వానికి ఇసుక వల్ల ఏవిధమైన ఆదాయం రాదు. కానీ తవ్వకాలకు అయ్యే ఖర్చు, సీనరేజీ, 18 శాతం జీఎస్టీ, నిర్వహణ ఖర్చులతో కలిపి టన్నుకు రూ.245 వసూలు చేయడానికి నిర్ణయించామన్నారు.సీనరేజ్ కింద వసూలుచేసే రూ.88 మండల పరిషత్, గ్రామ పంచాయతీ ఖాతాలకు ప్రతీనెలా జమ చేస్తామన్నారు. నిల్వ కేంద్రాల్లో ఇసుక ధరల తెలిసేలా బ్యానర్లు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా గనుల శాఖ అధికారి పేరిట సంయుక్తంగా బ్యాంకు ఖాతా తెరుస్తామని, ఇసుక కోసం ప్రజలు చెల్లించి సొమ్మును ఆ ఖాతాలో జమ చేస్తారన్నారు. సోమవారం నుంచి జిల్లాలోని ఇసుక స్టాక్ పాయింట్ల నుంచి ఉచితంగా సరఫరా చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ వివరించారు.

జిల్లాలో ఆరు స్టాక్ పాయింట్లు: కలెక్టర్



జిల్లాలో ఆరు స్టాక్ పాయింట్లలో మొత్తం 2,44,131 టన్నుల ఇసుక నిల్వలు ఉన్నట్టు గుర్తించామని కలెక్టర్, జిల్లా స్థాయి ఇసుక కమిటీ అధ్యక్షుడు రావిరాల మహేష్‌కుమార్ తెలిపారు. ఏడవ స్టాక్ యార్డు అయిన ఆలమూరులో ఇసుకలో సిల్టు శాతం ఎక్కువగా ఉన్నందున భవనాల నిర్మాణానికి పనికి రాదని నిర్ధారణ కావడంతో అమ్మకాలు నిలుపుదల చేశామన్నారు. రావులపాలెం-1లో 33,888 టన్నులు, రావులపాలెం-2లో 82,089 టన్నులు, కొత్తపేటలో 25,898 టన్నులు, జొన్నాడలో 10,590 టన్నులు, తాతపూడిలో 31,478 టన్నులు, కపిలేశ్వరపురంలో 60,188 టన్నులు ఇసుక నిల్వలు ఉన్నాయి.

నేడు యథావిధిగా జిలా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

అమలాపురం టౌన్, జూలై 7: కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిలా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అర్జీదారులు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి రాతపూర్వకంగా తెలియజేసి పరిష్కార మార్గాలు పొందాలని విజ్ఞప్తి చేశారు.

● ‘అగ్నివీర్’ నోటిఫికేషన్ విడుదల

అమలాపురం టౌన్, జూలై 7: భారత ప్రభుత్వం అగ్నివీర్ నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్టు జిల్లా ఉపాధి అధికారి ఇ.వసంత లక్ష్మి తెలిపారు. భారతీయులైన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులు. 2004 జూలై 3-2008 జనవరి 3 మధ్య జన్మించి ఉండాలి. ఇంటర్మీడియట్ ఎంపీసీ 50శాతం మార్కులు, ఇంగ్లీషులో 50శాతం మార్కులు వచ్చి ఉండాలి. లేదా పాలిటెక్నిక్‌లో 50 శాతం మార్కులు వచ్చి ఉండాలి. ఇంటర్ ఒకేషనల్ చదివిన అభ్యర్థులు కూడా అర్హులే. ఆసక్తి కలిగి అర్హులైన స్త్రీ, పురుష అభ్యర్థులు ఈ నెల 8 నుంచి 28వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వసంతలక్ష్మి కోరారు.

● రేపు ‘వికాస’లో జాబ్ మేళా

అమలాపురం టౌన్, జూలై 7: నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు వికాస ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని వికాస అవుట్ సోర్సింగ్ సంస్థ జిల్లా కార్యాలయంలో జరిగే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అమలాపురంలోని ఐటెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ సంస్థలో ట్రైనీ డెవలపర్లుగా పనిచేసేందుకు బీఎస్సీ, బీసీఏ, బీటెక్ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. కాకినాడలోని అరబిందో ఫార్మాలో టెక్నీషియన్లుగా పనిచేసేందుకు ఐటీఐ ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు, కెమిస్ట్‌గా పనిచేసేందుకు బీఎస్సీ బయోటెక్నాలజీ, ఎమ్మెస్సీ మైక్రోబయాలజీ చదివి 2022 నుంచి 2024 మధ్య ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. శ్రీకాళహస్తిలో రాక్‌మెన్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేసేందుకు పదో తరగతి, ఇంటర్ చదివిన వారికి ఉద్యోగాలు కల్పించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల యువత మరిన్ని వివరాల కోసం వికాస అవుట్ సోర్సింగ్ జిల్లా మేనేజరు గోళ్ల రమేష్‌ను 7989057588 నెంబరును సంప్రదించాలని కోరారు.

● జిల్లాలో వర్షపాతం వివరాలు...

అమలాపురం టౌన్, జూలై 7: జిల్లాలోని సఖినేటిపల్లి మండలంలో అత్యధికంగా 50.8మిల్లీమీటర్లు, అత్యల్పంగా కొత్తపేటలో 2.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆదివారం సగటున 13.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. మండలాల వారీగా వివరాలు ఇలా వున్నాయి... ఆత్రేయపురం 18.4, మండపేట 10.8, రాయవరం 13.8, రామచంద్రపురం 11.8, ఆలమూరు 9.4, రావులపాలెం 13.2, కొత్తపేట 2.6, కపిలేశ్వరపురం 3.2, కె.గంగవరం 3, ఐ.పోలవరం 16.2, ముమ్మిడివరం 5.4, అయినవిల్లి 3.4, పి.గన్నవరం 3.8, అంబాజీపేట 7.6, మామిడికుదురు 14.2, రాజోలు 24.6, మలికిపురం 17.6, అల్లవరం 25.8, అమలాపురం 5.8, ఉప్పలగుప్తం 4.6, కాట్రేనికోన 25.8.



ద్రాక్షారామలో పీరును ఊరేగిస్తున్న ముస్లింలు

మొహర్రం సంతాప దినాలు ఆరంభం

ఆదివారం నెలవంక దర్శనంతో మొదలు



నగరంలో ముస్తాబైన పంజా

మామిడికుదురు, జూలై 7 ముస్లింల ఆరాధ్య దైవమైన మహమ్మద్ ప్రవక్త మనుమడు హజరత్ ఇమామ్ హుస్సేన్, ఆయన పరివారం అమరత్వం పొందిన దినాలను పురస్కరించుకుని ఏటా జరుపుకునే మొహర్రం ఆదివారం ప్రారంభమైంది. దివిటీలను వెలిగించడం ద్వారా సంతాప కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. హిజ్రీ 61వ సంవత్సరంలో ఇరాక్ దేశంలోని కర్బలా పుణ్యభూమిలో అశువులుబాసిన హజరత్ ఇమామ్ హుస్సేన్, ఆయన పరివారం అమరత్వం పొందడాన్ని స్మరించుకుంటూ సంతాప దినాలు పాటిస్తారు. పది రోజుల పాటు పీర్లను, గుమ్మటాలను ఊరేగిస్తారు. మత ప్రబోధకుడు మొహమ్మద్ అలీ జాఫరీ మజ్లిస్ ఆలపిస్తారు.

ద్రాక్షారామ: ఆదివారం రాత్రి నెలవంక దర్శనంతో మొహర్రం సంతాప దినాలు ప్రారంభమయ్యాయి. ఇందుకు ద్రాక్షారామలో 20 పంజాలను సిద్ధం చేశారు. ఆగావారి పంజా నుంచి పీరును ద్రాక్షారామ, వెలంపాలెం వీధుల్లో ఊరేగించి తీసుకెళ్లి ఇమాం రజా పంజాలో ప్రతిష్ఠించారు. పంజాను పూలతో అలంకరించి ఫాతీహా ఇచ్చారు. నిప్పులపై నడవడం, తాజియాలు, పీర్ల ఊరేగింపు నిర్వహిస్తారు.





కొత్తపేటలో ఆర్అండ్‌బీ రోడ్డు ఆనుకుని సాగుతున్న అక్రమ నిర్మాణాలు

ఆక్రమణల పర్వం

- కొత్తపేటలో పేట్రేగిపోతున్న అక్రమణదారులు
- పోటాపోటీగా కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం
- చోద్యం చూస్తున్నడ్రైనేజీ, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు

కొత్తపేట, జూలై 7: ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు కబ్జా... ఆపై రాజకీయ పైరవీలు... సంబంధిత శాఖాధికారుల ప్రసన్నం... ఆటు తర్వాత పోటాపోటీగా కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం... ఇవీ కొత్తపేట ప్రధాన రహదారిని ఆనుకుని కనిపిస్తున్న దృశ్యాలు... తిలాపాపం తలా పిడికెడు అన్న రీతిలో ఆయా శాఖల అధికారులు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. కొత్తపేట బోడిపాలెం నుంచి పలివెల వంతెన వరకు ఈ అక్రమణల పర్వం కొనసాగుతోంది. వెనుక కౌశిక డ్రెయిన్ ప్రవహిస్తుంటే ముందు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి. ఆక్రమణదారులు మొదటగా రహదారి పక్కకు చేరి ఆ తర్వాత కొద్దికొద్దిగా వెనుక కౌశిక నదిని పూడ్చుకుంటూ ఆక్రమణ జాగా తయారు చేసుకుంటున్నారు. ఆ తర్వాత రాజకీయ పైరవీలు, సంబంధిత శాఖాధికారుల ప్రసన్నతలు కానిచ్చిన తర్వాత కట్టడాల నిర్మాణానికి తెరతీస్తున్నారు. మొక్కై వంగనిది మానై వంగునా అన్న సామెత మాదిరిగా అక్రమ కట్టడాలు. అంతకంతకూ పెరిగిపోతున్నాయి. దీనికి సంబంధించి ప్రధానంగా సంబంధిత శాఖాధికారుల్లో సమన్వయం లేకపోవడం. ఎవరికి వారు మనకెందుకులే అనే నిర్లక్ష్య ధోరణితో నేడు ప్రధాన రహదారి మనుగడ ప్రశ్నార్థకమైంది. ఇటీవలి కాలంలో ట్రాఫిక్ సమస్య పెరిగిపోయి ఎక్కడికక్కడే ట్రాఫిక్ నిలిచిపోతోంది. ద్విచక్ర వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ ఆక్రమణలతో సమస్య మరింత జఠిలమైంది. ఇదిలా ఉండగా ఇక్కడ ఆక్రమణదారులు చిరు వ్యాపారులు, మధ్య తరగతికి చెందిన దిగువ మధ్య తరగతికి చెందిన చిన్నకుటుంబాలు అనుకుంటే పొరపాటే. కొందరు ఆ స్థాయిలో ఉన్నప్పటికీ ప్రస్తుతం చేస్తున్న అక్రమ నిర్మాణదారులు అద్దెకు ఇచ్చుకునేందుకు కమర్షియల్ కాంప్లెక్స్‌లను నిర్మిస్తుండడం విశేషం. దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టిసారించి సంబంధిత అధికారులను విచారించి అక్రమ నిర్మాణదారులపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.



నోటీసులు ఇస్తున్నా పట్టించుకోవట్లేదు

ఆనంద్, డ్రైనేజీ శాఖ ఏఈ

ఇప్పటివరకు 230 ఆక్రమణదారులను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాము. అక్రమ నిర్మాణాలపై పై స్థాయిలోనే చర్యలు తీసుకోవాల్సి ఉంది. మేము నోటీసులు ఇచ్చినా పట్టించుకోవట్లేదు.

కొత్త నిర్మాణాలకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వం

నరేష్, విద్యుత్ శాఖ ఏఈ

గతంలో నిర్మాణాలకు విద్యుత్ కనెక్షన్లు ఎలా ఇచ్చారో తెలియదు. ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాలకు మాత్రం కనెక్షన్లు ఇవ్వము.

జిల్లాలో 1.68 లక్షల ఎకరాల్లో
ఖరీఫ్ నాట్లు

వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ బోసుబాబు



ఆలమూరు, జూలై 7: ఖరీఫ్ సీజన్లో వరి నాట్లు శరవేగంగా సాగుతున్నాయని, ఈ ఏడాది జిల్లాలో 1,68,780 ఎకరాల్లో వరి నాట్లు వేయనున్నట్టు వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ ఓలేటి బోసుబాబు తెలిపారు. ఆలమూరు, రామచంద్రపురం, కొత్తపేట సబ్ డివిజన్లలో వరి నాట్లు వేగంగా సాగుతున్నాయని, మిగిలిన ప్రాంతాల్లో మందకొడిగా సాగుతున్నాయని వివరించారు. ప్రస్తుతం 23వేల ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయని, ఈనెలాఖరుకు నూరుశాతం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని... ఆ మేరకు రైతులను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. నాట్లు వేసిన పంట భూముల్లో బాటలు ఏర్పాటు చేసుకోవాలని... తద్వారా ఎరువులు, పురుగుమందులు పిచికారీ చేయడానికి వీలుంటుందన్నారు. ఈ ఏడాది



ఎంటీయూ-7029 70 శాతం వరకు సాగు జరుగుతోందని ఎంటీయూ 1318 రకం 20శాతం, మిగిలిన రకాలు పది శాతం ఉంటుందన్నారు. జిల్లాలో 40శాతం వరకు వెదజల్లు, మిగిలిన 60శాతం నాట్లు ఉంటాయన్నారు. నాట్లు త్వరితగతిన పూర్తి చేయడం వల్ల పంట దిగుబడి సమయంలో తుపాన్ల ప్రభావం ఉండదని రైతులకు సూచించారు. జిల్లావ్యాప్తం గా 43,285 మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధంగా వున్నాయని... వీటిలో యూరియా 15,200, డీఏపీ 3,700, ఎంవోపీ 1949, కాంప్లెక్స్ ఎరువులు 21,000, సూపర్‌ఫాస్ఫేట్ 1,270 మెట్రిక్ టన్నులను సహకార సంఘాలు, ప్రైవేట్ డీలర్లతో పాటు పలు సంస్థల వద్ద సిద్ధం చేసినట్టు బోసుబాబు చెప్పారు. జిల్లాలో ని 370 రైతు సేవా కేంద్రాల నిర్మాణానికి నిధులు మంజూరు కాగా... అందులో ప్రస్తుతం 120 కేంద్రాలను తమ శాఖకు స్వాధీనం చేశారని చెప్పారు.



ముమ్మిడివరం నియోజకవర్గంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) విజయోత్సవ ర్యాలీ ఆదివారం వైభవంగా జరిగింది. తాళ్లరేవు మండలం సుంకరపాలెంలో ప్రారంభమైన ర్యాలీకి జిల్లా ముఖద్వారమైన ఎదుర్లంక వారధి వద్ద ఘన స్వాగతం లభించింది. భారీ క్రేన్‌తో గజమాల వేసి స్వాగతం పలికారు. ప్రత్యేకంగా అలంకరించిన చైతన్య రథంపై నుంచి మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో కలిసి ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బుచ్చిబాబు ప్రజలకు అభివాదం చేశారు. అక్కడి నుంచి మురమళ్ల, ముమ్మిడివరం, అనాతవరం మీదుగా అమలాపురం చేరుకుంది. అడుగడుగునా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పూలమాలలతో స్వాగతం పలికి మంగళ హారతులు ఇచ్చారు.... 6లో



లక్ష్మీనారాయణను అభినందిస్తున్న నాయకులు

కోనసీమ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా

దేశంశెట్టి లక్ష్మీనారాయణ

అమలాపురం టౌన్, జూలై 7: కోనసీమ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని అమలాపురం శుభగృహ కాన్ఫరెన్సు హాలులో ఆదివారం నిర్వహించారు. 16 మండలాలకు చెందిన రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు హాజరు కాగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేశంశెట్టి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పిప్పళ్ల రాంబాబు, ఉపాధ్యక్షుడిగా దివ్వి శ్రీనివాస్, కోశాధికారిగా జి.చంద్రశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా కంచర్ల వెంకట్రావు (బాబి), ప్రధాన సలహాదారుగా బోనం కృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కోనసీమలో వెనుకబడ్డ రైస్ మిల్లింగ్ ఇండస్ట్రీని గాడిలో పెట్టేందుకు ప్రభుత్వ సహకారం తీసుకోవాల్సి ఉందన్నారు. కోనసీమ జిల్లాగా ఏర్పాటైనప్పటికీ ఇండస్ట్రీపరంగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. రైస్ మిల్లింగ్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించేందుకు తీర్మానించారు. త్వరలోనే కోనసీమలోని ఎంపీతో పాటు ఎమ్మెల్యేలను కలుసుకునేందుకు నిర్ణయించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణను కూటమి నాయకులు అరిగెల నానాజీ, ఆకేటి పెద్ద, కోలపల్లి గోపి, చీకట్ల నాని, మద్దింశెట్టి సురేష్, అడపా అవినాష్, యాళ్ల సత్తిబాబు, మంచెం బాబి, ఆకుల శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.



37ఏళ్ల అనంతరం కలుసుకున్న అల్లవరం హైస్కూలు పూర్వ విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం

అల్లవరం, జూలై 7:

అల్లవరం జడ్పీ హైస్కూలు 1987-88 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం గణపతి పబ్లిక్ స్కూలులో సందడి చేశారు. గత జ్ఞాపకాలు గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. వారిని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ కలిసి అభినందించారు. మంగళంపల్లి సుబ్రహ్మణ్యం, కంకిపాటి గణపతిరామారావు, కడలి శివన్నారాయణ, అడపా శ్రీనివాసరావు, బసవా భారతి, కుడుపూడి రమాదేవి, ఆదుర్తి కృష్ణకుమారి, బండి గుప్తాపు వెంకటలక్ష్మి, కుడుపూడి తిలక్, రుద్రరాజు సీతామరాజు, తోరం రాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్ర


రథయాత్రకు హాజరైన భక్తులు


సాంస్కృతిక కార్యక్రమం


రథాన్ని లాగుతున్న మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి


వీధుల్లో రథయాత్ర జరుగుతున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 7: రాజమహేంద్రవరం గౌతమి ఘాట్‌లోని అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) ఆధ్వర్యంలో స్థానిక శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి ప్రారంభమైన జగన్నాథ స్వామి రథయాత్రను మధ్యాహ్నం 3 గంటలకు జోనల్ సెక్రటరీ రేవతి రమణ్‌దాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్, సత్యగోపీనాథ్‌దాస్ ఇస్కాన్ సేవలను కొనియాడారు. భక్తులతో పాటు పురందేశ్వరి, దుర్గేష్ జగన్నాథ రథాన్ని లాగారు. రథయాత్ర రామాలయం సెంటర్ నుంచి గోరక్షణపేట, ఆజాద్ చౌక్, జాంపేట చర్చి, వెజిటేబుల్ మార్కెట్, టీటీడీ కాలేజీ, డీలక్స్ సెంటర్ హెడ్ పోస్టాఫీసు, మహాకాళేశ్వర గుడి నుంచి ఇస్కాన్ గుడి వరకు సాగింది. అనంతరం సత్సంగ్ ప్రవచనాలు, మహా మంగళహారతి, సాంస్కృతిక కార్యక్రమాలు, నిర్వహించారు. భక్తులకు అన్నదానం జరిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



సర్పవరం జంక్షన్, జూలై 7: జిల్లాలో అక్రమ పీడీఎస్ బియ్యం నిల్వలు పౌర సరఫరాల శాఖ అధికారులు నిర్వహిస్తున్న దాడుల్లో వెలుగులోకి వస్తున్నాయి. ఆదివారం కార్పొరేషన్ 2వ డివిజన్ బొందగుంటలో ఓ పాడుబడిన ఇంట్లో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వలు ఉన్నాయన్న సమాచారం మేరకు అర్బన్ ఎంఎస్‌వో ఆనంద్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 1.85 టన్నుల బియ్యం సీజ్ చేశారు. కిర్లంపూడి మండలం సింహాద్రిపురానికి చెందిన కందా నాగసత్య నారాయణ అనే వ్యక్తి ఇంటింటికి వెళ్లి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి 2వ డివిజన్ బొందగుంటలో డోర్ నెంబర్ 70-17-42/1 పిల్లి సత్యవతికి చెందిన పాడుబడిన పెంకుల షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచాడు. అధికారులకు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా ఆ గదిలో ఉన్న బస్తాల్లో ఉన్న సుమారు 1.85 టన్నుల పోర్టిఫైడ్ కెర్నల్స్ పీడీఎస్ బియ్యంగా నిర్ధారించారు. నిందితుడు నాగసత్యనారాయణపై కేసు రాసి, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ఎండీయూ వాహనం ద్వారా కాకినాడలో గల ఎంఎస్ఎల్ గొడౌన్‌కు తరలించినట్లు ఎంఎస్‌వో ఆనంద్ తెలిపారు. పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసినా, అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్‌ఐ రాజు, కృష్ణానగర్ వార్డు సెక్రటరీ, సిబ్బంది పాల్గొన్నారు.

గత ప్రభుత్వ పోకడలతో విద్యా వ్యవస్థకు దెబ్బ

అమలాపురం టౌన్, జూలై 7: గత ప్రభుత్వ పోకడలతో ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం సన్నగిల్లిందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. సాల్ట్ పథకం పేరుతో తీసుకువచ్చిన సర్క్యులర్ 172, జీవో నెం.117లతో ప్రభుత్వ విద్యా రంగానికి తీరని నష్టం వాటిల్లిందన్నారు. ప్రాథమిక తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల ప్రాథమిక విద్య పూర్తిగా కుంటుపడిందన్నారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య తగ్గడానికి గల కారణాలపై ప్రస్తుత ప్రభుత్వం సమీక్ష జరపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించే బాధ్యత ఉపాధ్యాయులే తీసుకోవాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం అమలాపురం ఎంప్లాయీస్ హోంలో పి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యారంగ సంస్కరణలు ప్రభుత్వ పాఠశాలలు బలహీనమవ్వడానికి కారణమయ్యాయన్నారు. బైజూస్, టోఫెల్, సీబీఎస్ఈ, ఐబీ అంటూ రకరకాలుగా విద్యార్థులపై గత ప్రభుత్వం ఎన్నో ప్రయోగాలు చేసి ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం లేకుండా చేశారని ఆరోపించారు. ప్రాథమిక స్థాయిలో మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని విద్యా హక్కు చట్టం చెబుతున్నా జగన్ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియం లేకపోవడం విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను వదిలి వెళ్లిపోవడానికి కారణమవుతోందని విమర్శించారు. పర్యవేక్షణ పేరుతో ప్రభుత్వ అధికారులే ప్రభుత్వ పాఠశాలల్లో చదువు రాదని ప్రచారం చేసి ఈ దుస్థితికి తీసుకువచ్చారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం 4,600కు పైగా 1, 2 తరగతులు మాత్రమే ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను చేర్చుకునేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరారు. 6 నుంచి 10 వరకు ఉన్న పాఠశాలల్లో సమాంతరం మీడియానికి అనుమతి ఇవ్వాలన్నారు. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు టీమ్‌గా ఏర్పడి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగేలా ప్రయత్నం చేయాలన్నారు. కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలో ఒక పాఠశాల గతంలో 250 మంది విద్యార్థులతో కళకళలాడగా నేడు అదే పాఠశాలలో ఇద్దరు విద్యార్థులే మిగిలారన్నారు. మరో రెండు పాఠశాలల్లో ఒక్కో విద్యార్థి మాత్రమే ఉన్నారన్నారు. కడప, కర్నూలు, శ్రీకాకుళం, విజయనగరం, గుంటూరు జిల్లాల్లోనూ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, పాఠశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వర్లు కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు త్యాగాలకు సిద్ధం కావాలన్నారు. అవసరమైతే అదనంగా ఒక గంట పాఠశాలల్లోనే ఉండి విద్యాబుద్ధులు నేర్పించి పాఠశాలలపై నమ్మకం కల్పించాలన్నారు. జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వెంకటేశ్వరరావు, సుబ్బారావు మాట్లాడుతూ యూటీఎఫ్ స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాలు జరుపుకోబోతున్నామన్నారు. జీవో నెం.117ను తక్షణం రద్దు చేయాలని, 1, 2 తరగతులు మాత్రమే ఉన్న పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల విద్యార్థులను చేర్చుకునేందుకు అనుమతి ఇవ్వాలని, ప్రాథమిక పాఠశాలల్లో మాతృభాషలోనే విద్యా బోధన ఉండాలని తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ)తో పాటు జిల్లా ఉపాధ్యక్షుడు పి.సురేంద్రకుమార్, జిల్లా కార్యదర్శులు టి.చంద్రకళ, జీవీ రమణ, వైవీటీ దుర్గాప్రసాద్, మురళీమోహన్, ఎం.ప్రదీప్‌కుమార్, వైవీఎస్ఎం బాలాజీ, పి.శ్రీనివాస్, పి.మురుగేశ్వరరావు, వి.రత్నం, టి.విజయకృష్ణ పాల్గొన్నారు.


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

4 ప్రైవేటు ట్రావెల్ బస్సులు సీజ్

రూ.11 లక్షల జరిమానా


బస్సులను సీజ్ చేసిన అధికారులు

రావులపాలెం, జూలై 7: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వాహనాలను ఆపి రికార్డులను తనిఖీ చేశారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి వచ్చే కాంట్రాక్టు క్యారేజ్ బస్సులను ఆపి తనిఖీ చేశారు. ఆల్ ఇండియా పర్మిట్ ట్యాక్స్ కట్టకుండా తిరుగుతున్న నాలుగు బస్సులను సీజ్ చేసి ఆర్టీసీ డిపోకు తరలించారు. వాటికి రూ.11 లక్షలు జరిమానా విధించారు. అంతే కాకుండా హెవీ గూడ్స్ వెహికల్స్, ఓవర్‌లోడ్ ఆటోలు, క్యాబ్‌లు, ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి రూ.లక్ష వరకు అపరాధ రుసుం విధించారు. వాహన చోదకులు వాహనాలకు పూర్తిస్థాయిలో రికార్డులు ఉండేలా చూసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. తనిఖీల్లో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేవీ నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

తలుపులమ్మ లోవలో ఆషాఢ వైభవం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

తుని రూరల్, జూలై 7: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలుత అమ్మవారికి శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకాలు అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ పండితులు భక్తులకు దర్శనభాగ్యం కల్పించడంతో వేలాది మంది భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆషాఢ మాసం తొలి ఆదివారం మట్టి గాజుల విశేష అలంకరణలో భక్తులను అమ్మవారు అనుగ్రహించారు. అమ్మవారి ప్రీతిప్రధానమైన ఆషాడ మాస పర్వదినాలు కావడంతో తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాది వాహనాల్లో భక్తులు లోవకు తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో రద్దీ నెలకొంది. ముగ్గురు సీఐలు, నలుగురు ఎస్ఐలు, సుమారు 100కు పైబడి సిబ్బందితో జిల్లా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ఆలయ ఈవో విశ్వనాథరాజు, ఛైర్మన్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కుటుంబ సమేతంగా లోవకు తరలివచ్చిన భక్తులు దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రత్యేక షెడ్‌లలో, వసతి గదుల్లో వంటవార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం ఒక్కరోజు అమ్మవారిని 40 వేలకు పైబడి భక్తులు దర్శించుకోగా ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.9.61 లక్షల ఆదాయం సమకూరింది. గత ఏడాది కంటే ఈ ఏడాది ఆషాడ మాస మొదటి ఆదివారం రూ.2 లక్షల ఆదాయం అధికంగా వచ్చినట్లు ఈవో విశ్వనాథరాజు తెలిపారు.


గాజుల అలంకరణలో తలుపులమ్మ అమ్మవారు

లోవ భక్తుల నిలువ దోపిడీ

ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి వేలాదిగా తరలివస్తున్న భక్తులను ఆలయంలో వివిధ షాపుల పాటదారులు నిలువునా దోచుకుంటున్నారు. టోల్‌గేట్, చీరలు, కూల్‌డ్రింక్స్, కొబ్బరికాయలు ఇతర షాపుల్లో డబుల్ రేట్లు వసూలు చేస్తున్నట్లు భక్తులు వాపోతున్నారు. అధిక ధరల విక్రయాలపై ఆలయ అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

మరిడమ్మ జాతరకు భక్తులు


అమ్మవారి దర్శనానికి వెళ్తున్న భక్తులు



పెద్దాపురం, జూలై 7: భక్తుల కొంగు బంగారం మరిడమ్మ జాతరకు మొదటి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, క్యూలైన్లలో భక్తుల సౌకర్యం కోసం టెంట్లు నిర్మించారు. అలాగే పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, చంటి పిల్లలకు పాలు, పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి పర్యవేక్షణలో సీఐ రవికుమార్, ఎస్ఐ సురేష్ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుమారు 15 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక చాపల వీధి సంబరం ఎంతగానో ఆకట్టుకుంది. పలు రకాల దేవతా మూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

నేటి నుంచి ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు

కాకినాడ సిటీ, జూలై 7: ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు కాకినాడ సూర్యకళా మందిరంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించనున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.జాన్సన్‌బాబు, కె.శివారెడ్డి వెల్లడించారు. ఈ మేరకు కాకినాడలోని పలు కూడళ్లను ఏఐఎస్ఎఫ్ జెండాలు, తోరణాల అలంకరిస్తున్న పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులకు 26 జిల్లాల నుంచి రాష్ట్ర నాయకులు, విద్యార్థులు హాజరవుతారన్నారు. విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ అనేక పోరాటాలు సాగించి విజయాలు సాధించిందన్నారు. శిక్షణా తరగతుల ప్రారంభానికి ముందుగా ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని మానవహక్కుల ఉద్యమనేత, ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు ఆవిష్కరిస్తారన్నారు. ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరవుతారని, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రారంభ ఉపన్యాసం చేస్తారని తెలిపారు.

హైకోర్టు జడ్జి పూజలు


స్వామివారిని దర్శించుకుంటున్న జడ్జి

ఆత్రేయపురం, జూలై 7: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని ఆదివారం హైకోర్టు జడ్జి టి.మల్లికార్జున రావు దంపతులు దర్శించుకున్నారు. వారికి అర్చక బృందం పూర్ణకుంభ స్వాగతం పలికింది. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. జడ్జి దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

వేడుకగా సత్యదేవుని రథోత్సవం


రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అన్నవరం, జూలై 7: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ఆదివారం రథోత్సవం వేడుకగా జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను టేకు రథంపై ఆశీనులు గావించి భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రదక్షిణ చేయించారు. అనంతరం హారతులిచ్చి తిరిగి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. అలాగే సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం ఆరోగ్య ప్రదాత అయిన సూర్యభగవానుడికి విశేష పూజలు నిర్వహించి వివిధ ఆసనాలతో ప్రార్థించారు. అనంతరం క్షీరాన్నం నివేదించి భక్తులకు పంపిణీ చేశారు.

నేడు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 7: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో జరగనుంది. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ సమావేశానికి హాజరవుతున్నారు. కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రానున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలి రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుండడంతో ఆ పార్టీ రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆహ్వానితులకు గూగుల్ ఫార్మాట్‌లో అప్లికేషన్ ద్వారా సమ్మతి పంపించారు. అలాగే ఎంపీ పురందేశ్వరి ఆహ్వానితులను ఆడియో కాన్ఫరెన్స్‌లో ఆహ్వానించారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతంపై ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు.

అరుదైన డెవిల్ ఫిష్



ఆలమూరు, జూలై 7: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానం అగ్రహారం వద్ద ఆదివారం కాలువలో అరుదైన డెవిల్ ఫిష్ లభ్యమైంది. జాతీయ రహదారి చెంతన ఉన్న కోరంగి కాలువలో మత్స్యకారులు చేపల కోసం వల వేస్తే ఇది చిక్కింది. నల్లచారలతో ఆకర్షణీయంగా ఉండడంతో అక్కడి ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ డెవిల్ ఫిష్ కాలువలు, గోదావరిలో పెరిగే సాధారణ చేపలను తినేస్తుందని, మిగిలిన చేప జాతికి ప్రమాదమని మత్స్యకారులు చెప్తున్నారు.

ప్రసాదం ప్యాకెట్ల విక్రయాలు

40 వేల ప్యాకెట్ల అమ్మకం

అన్నవరం, జూలై 7: ఆషాఢ మాసం ప్రారంభం కావడంతో తొలి ఆదివారం తలుపులమ్మ లోవ దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో సత్యదేవుడి ప్రసాదం కొనుగోలుకు జాతీయ రహదారిపై భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో దేవస్థానం అధికారులు అదనపు ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశారు. కొండదిగువ తొలిపావంచా, నమానాలయం ఇరువైపులా కౌంటర్ల వద్ద సుమారు 40 వేల ప్రసాదం ప్యాకెట్లను విక్రయించినట్లు అధికారులు వెల్లడించారు. రాజమహేంద్రవరం వైపు వెళ్లే నమూనాలయం వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన కౌంటర్‌లో 5 వేల ప్యాకెట్లను విక్రయించినట్లు తెలిపారు. ఎటువంటి తోపులాటలు, వివాదాలు లేకుండా దేవస్థానం సెక్యూరిటీ ద్వారా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కొండపైన, దిగువన అన్ని కౌంటర్లు కలిపి 60 వేల ప్రసాదం ప్యాకెట్లను విక్రయించారు.

పుర్హూతికా అమ్మవారికి కంఠాహారం


కంఠాహారం బహూకరిస్తున్న దృశ్యం

పిఠాపురం, జూలై 7: కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్టాన దేవతయిన పుర్హూతికా అమ్మవారికి భక్తులు బంగారు కంఠాహారం బహూకరించారు. విశాఖపట్నం మధురవాడకు చెందిన కంది సూర్యచంద్రరావు, సుజాత దంపతులు 55.46 గ్రాముల బంగారంతో కంఠాహారం తయారు చేయించారు. దీనిని ఆదివారం ఆలయ అధికారులకు అందజేశారు. పూజలు అనంతరం అమ్మవారికి అలంకరింప చేశారు. దీని విలువ రూ.4.50 లక్షలు ఉంటుంది. దాతలను ఆలయ ఈవో దుర్గాభవాని, ఇతర అధికారులు ఆలయ మర్యాదలతో సత్కరించి ప్రసాదాలు, అమ్మవారి ఫొటోను అందజేశారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

రావులపాలెం, జూలై 7: చోరీ కేసులో పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం చింతపల్లికి చెందిన ఖండవల్లి సీతారాముడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎం.ప్రేమ్‌కుమార్ తెలిపారు. గోపాలపురానికి చెందిన కంకటాల వెంకటరమణ కిరాణాషాపులో ఈనెల 3న జరిగిన చోరీ కేసులో నిందితుడు సీతారాముడి నుంచి రూ.1.40లక్షలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

సత్తెమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

ముమ్మిడివరం, జూలై 7: ఆషాడ మాసం తొలి ఆదివారం సందర్భంగా సీహెచ్ గున్నేపల్లిలోని సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయం భక్తులతో పోటెత్తింది. సత్తెమ్మతల్లి అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. నడింపల్లి కుమారి, గనిశెట్టి వీరబాబుల ఆర్థికసాయంతో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మేకల వెంకన్నబాబు ఆర్థికసాయంతో చిన్ని పిల్లలకు పాలు పంపిణీ చేశారు.

- అమలాపురం వరకు భారీ ర్యాలీ
- పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పూలమాలలతో స్వాగతం

భూకబ్జాలు చేస్తే కఠిన చర్యలు: మంత్రి సుభాష్


బాధితురాలు అంజనీకుమారితో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

కె.గంగవరం, జూలై 7: రామచంద్రపురం నియోజకవర్గంలో ఎవరైనా భూకబ్జాలకు పాల్పడినవారికి, వారికి మద్దతు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు. కోటిపల్లికి చెందిన ఆర్యాది అంజనీకుమారి స్థలాన్ని కొందరు ఆక్రమించి షెడ్‌వేసి, క్లాత్‌తో ప్రహరీ ఏర్పాటు చేశారు. దీనిపై అంజనీకుమారి పోలీసులకు ఫిర్యాదుచేసి, స్థానిక నాయకుల సహాయంతో మంత్రి సుభాష్‌కు సమస్యను విన్నవించారు. ఆయన వెంటనే స్పందించి కోటిపల్లి వచ్చి కబ్జా స్థలాన్ని పరిశీలించారు. కబ్జాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎంతటివారైనా ఉపేక్షించవద్దని ఎస్ఐ కె.జానీబాషాను ఆదేశించారు. తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి సోమవారం మధ్యాహ్నంలోపు సర్వే చేసి అంజనీకుమారికి న్యాయం చేయాలని, ఆక్రమణదారుని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. స్థానిక సమస్యపై మంత్రి సుభాష్ స్పందించిన తీరును గ్రామస్తులు అభినందించారు.


రోడ్ల దుస్థితిపై మహిళల గోడు వింటున్న మంత్రి సుభాష్

జగనన్న కాలనీలో రోడ్లు వేయిస్తాం

ద్రాక్షారామ, జూలై 7: జగన్నాయకులపాలెం జగనన్న కాలనీలో రోడ్ల దుస్థితిని ఆదివారం మంత్రి వాసంశెట్టి సుభాష్ పరిశీలించారు. కాలనీవాసులు మంత్రికి తమ బాధలు వివరించారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ నిధులు కేటాయించి బుధవారంలోగా కాలనీలో గ్రావెల్ రోడ్లు వేయిస్తామన్నారు. సొంత నిధులతోనైనా రోడ్లు వేయిస్తామన్నారు. కార్యక్రమంలో జగన్నాయకులపాలెం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు నాయకులుపాల్గొన్నారు.

తాళ్లమ్మతల్లిని దర్శించుకున్న మంత్రి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 7: పట్టణంలోని తాళ్లమ్మతల్లి తీర్థమహోత్సవం పురస్కరించుకుని అమ్మవార్ని మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు.

హరీష్, బుచ్చిబాబు విజయోత్సవ ర్యాలీ




ముమ్మిడివరం విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే బుచ్చిబాబు, ఎంపీ హరీష్‌మాధుర్, మంత్రి వాసంశెట్టి సుభాష్, ర్యాలీలో పాల్గొన్న కూటమి కార్యకర్తలు, ఐ.పోలవరం: బుచ్చిబాబును సత్కరిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, జూలై 7: ముమ్మిడివరం నియోజకవర్గంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు)ల విజయోత్సవ ర్యాలీకి అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. తాళ్లరేవు మండలం సుంకరపాలెంలో ఆదివారం సాయంత్రం హరీష్ మాధుర్, దాట్ల సుబ్బరాజులు ప్రారంభించిన విజయోత్సవ ర్యాలీకి జిల్లా ముఖద్వారమైన ఎదుర్లంక వారధి వద్ద ఘన స్వాగతం లభించింది. భారీ క్రేన్‌తో, గజమాలలతో వారికి స్వాగతం పలికారు. అక్కడ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, దివంగత లోక్‌సభ స్పీకర్ బాలయోగి విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రత్యేకంగా అలంకరించిన చైతన్య రథంపై నుంచి విజయోత్సవ ర్యాలీ సాగింది. మురమళ్ల లక్ష్మీదేవిలంక, అన్నంపల్లి, కొమానపల్లి, కాశివానితూము, ముమ్మిడివరం, అనాతవరం మీదుగా అమలాపురం వైపు సాగింది. అడుగడుగునా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పూలమాలలతో స్వాగతం పలికి మంగళ హారతులు ఇచ్చారు. తీన్‌మార్ డప్పు వాయిద్యాలు, భారీ బాణసంచా కాల్పులతో విజయోత్సవ ర్యాలీ సాగింది. అన్నంపల్లి సెంటర్, కాశివానితూము సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ముమ్మిడివరం పోలమ్మచెరువు గట్టున ఉన్న అంబేద్కర్, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాలకు వారు పూలమాలలువేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి అనాతవరం సెంటర్ చేరుకుని అక్కడ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అక్కడి నుంచి అమలాపురం వైపు విజయోత్సవ ర్యాలీ సాగింది. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కొమరగిరిలో విజయోత్సవ యాత్రలో పాల్గొని ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే సుబ్బరాజు వెంట చైతన్యరథంపై అమలాపురం వైపు సాగారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాయకులు గుత్తుల సాయి, నాగిడి నాగేశ్వరరావు, తాడి నరసింహారావు, చెల్లి అశోక్, రాయపురెడ్డి రాజా, గంధం పల్లంరాజు, పొద్దోకు నారాయణ రావు, గొలకోటి దొరబాబు, చిక్కాల అంజిబాబు, దాట్ల పృథ్వీ రాజ్, సాగి సూరిబాబురాజు, కాకర్లపూడి రాజేష్, అర్థాని శ్రీనివాసరావు, దంగేటి శ్రీను, దాట్ల బాబు, మిమ్మితి చిరంజీవి, దొమ్మేటి రమణకుమార్, ములపర్తి బాలకృష్ణ, అడబాల సతీష్‌కుమార్, కడలి నాగు, కట్టా సత్తిబాబు, దివి మహాలక్ష్మి, బొక్కా రుక్మిణి, గిడ్డి రత్నశ్రీ, మోకా బాలప్రసాద్, గుద్దటి జమి, దూడల స్వామినాయుడు, గోదశి పుండరీష్, వాసంశెట్టి అమ్మాజీ, మెండి కమల, ముమ్మిడివరపు వరలక్ష్మి పాల్గొన్నారు. ర్యాలీలో చైతన్య రథం వెంట కార్లు, మోటార్‌సైకిల్, ప్రత్యేక వాహనాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. ఈసందర్భంగా హరీష్, దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ తమ విజయానికి కృషి చేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

తండ్రి ఆశయ సాధనకు కృషి చేస్తా

ఐ.పోలవరం, జూలై 7: తన తండ్రి జీఎంసీ బాలయోగి ఆశయ సాధనకు కృషిచేస్తానని అమలాపురం ఎంపీ జి.వి.హరీష్‌మాధుర్ అన్నారు. తనను ఎంపీగా గెలిపించిన కోనసీమ ప్రజలు రుణం తీర్చుకుంటానన్నారు. అందరికి సహకారంతో కోనసీమ సమగ్రాభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ఎంపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఐ.పోలవరం మండలానికి వచ్చిన హరీష్‌కు ఎదుర్లంక జీఎంజీ బాలయోగి వారధి వద్ద ఆదివారం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బుచ్చిబాబులను టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు గజమాలతో ఘనంగా సన్మానించారు. బాణసంచా కాల్చి భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత బాలయోగి విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ వాహనర్యాలీతో బయలు దేరారు. హరీష్‌కు స్వాగతం పలికిన వారిలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, కాకర్లపూడి రాజేష్, మాజీ ఎంపీపీ దాసరి జగదీశ్వరి, మాజీ సర్పంచ్‌లు బీరసత్యకుమారి, చెయ్యేటి శ్రీను, సాకా సీతాదేవి, చోడిశెట్టి బ్రహ్మానందం, సాగిరాజు సూరిబాబురాజు, నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి. గొల్లకోటి దొరబాబు, పొద్దోకు నారాయణరావు, తాడి నరసింహరావు, చెల్లి అశోక్, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, నండిపల్లి సుబ్బారాజు, ఉప్పు వాసు, ఎం.గంగసూర్యనారాయణ, గాదిరాజు బుచ్చి కృష్ణంరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ హరీష్‌కు స్వాగతం

పి.గన్నవరం, జూలై7: ఎంపీగా బాధ్యతలు చేపట్టిన హరీష్ మాధుర్ ఆదివారం తొలిసారిగా ఐ.పోలవరం మండలం ఎదుర్లంక వచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మిలు ఆయన ఘన స్వాగతం పలికారు. మట్టపర్తి రామకృష్ణ, సంసాని పెద్దిరాజు, శేరు శ్రీనుబాబు, అంబటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


మండపేట: ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జూలై 7: టీడీపీ కూటమి విజయం కోసం మాదిగలు చేసిన సహకారం మరువలేనిదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. స్థానిక ఎమ్మార్పీఎస్ సంఘ నాయకుడు దూళి జయరాజు ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వ హించారు. వికలాంగులకు పింఛన్ సాధించిన ఘనత మంద కృష్ణ మాదిగకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, ఎమ్మార్పీఎస్, బీఎస్పీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీల ఆధ్వర్యంలో పోలమ్మ చెరువుగట్టున ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని, అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. దివ్యాంగుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు నలమాటి లంకరాజు ఎమ్మార్పీఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఖండవల్లి ఏలియా ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆకుమర్తి సాయి కృష్ణ, ఉండ్రాజవరపు కృష్ణమూర్తి, పెదపూడి రుక్మిణి, అయినవిల్లి రామారావు, అయినవిల్లి వలీబాబా, ఉండ్రాజవరపు వెంకటేశ్వరరావు, పెదపూడి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మామిడికుదురు: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయుడు మందకృష్ణ మాదిగ అని జనసేన మండలశాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి నూటుకుర్తి సత్యనారాయణ మాదిగ కొనియాడారు. ఆదివారం మామిడికుదురులో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ పతాకాన్ని ఆవిష్కరించి కేక్ కట్‌చేసి అభిమానులకు పంచారు. కార్యక్రమంలో ముసూడి నాగప్రభాకర్, తొత్తరమూడి శ్రీను, చాట్ల నాగేశ్వరరావు, బళ్ల సతీష్, ఇంటి మహేంద్ర, మంద గాంధీ, బొంతు సుధాకర్, బత్తుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: ఏమార్పీఎస్ 30వఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణమాదిగ జన్మదినం పురస్కరించుకుని రాయవరంలో ఏమార్పీఎస్ నాయకులు ఆదివారం కవాతు నిర్వహించారు. అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, సంజయ్‌రాజు, దువ్వ చంద్రశేఖర్, చంద్రమళ్ల సునీల్, రాజు, ఇందుగమిల్లి అరుణ్‌కుమార్, గొట్టుముక్కల రాజు, చంద్రమళ్ల భరత్, మందపల్లి శేఖర్, గొర్త విజయ్‌కుమార్, పలివెల సుధీర్, కొండలరావు, గంగరాజు, యాకోబు, బేడ బుడగ జంగం కుల పెద్దలు, డప్పు కళాకారులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: మంద కృష్ణమాదిగ 59వ పుట్టినరోజును, ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆత్రేయపురం బులిపేటలో బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహానికి టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు పూలమాల వేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్మర వీరరాఘవులు, గంధం యాకూబ్, అరుణ్‌కుమార్ కేక్ కట్ చేశారు.

అంబాజీపేట: మంద కృష్ణమాదిగ పుట్టినరోజు వేడుకను, ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం దండోర యూత్ ఆధ్వర్యంలో మందా కృష్ణమాదిగ పుట్టినరోజు కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో కొల్లి సుధాకర్, దాసరి సత్యనారాయణ, గణపతి వీరరాఘవులు, దొమ్మేటి సాయికృష్ణ, దిగుమర్తి చిట్టిబాబు, పెదపూడి శ్రీనివాసరావు, కొర్లపాటి గోపి, మంద రాజేష్, నేదునూరి పెద్దిరాజు, ఉందుర్తి నాగబాబు, గుడాల పణి తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఘనంగా జరిపారు. రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ సాధించిన విజయాలను బీజేపీ ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి పలివెల రాజు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ సిర్రా సురేష్, కాజులూరు మండల కన్వీనర్ ఖండవల్లి శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ నాయకులు లంక సత్యం, విగ్రహ కమిటీ నాయకులు లంకరాజు, పలివెల ప్రకాష్, పోసపల్లి రాజు, పువ్వుల వరప్రసాద్, లంక ప్రకాశరావు, తాతపూడి సుబ్బారావు పాల్గొన్నారు.

ఐపోలవరం: మండలంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. వర్గీకరణ కోసం మంద కృష్ణ చేసిన పోరాటాన్ని గుర్తుచేసుకున్నారు కార్యక్ర మంలో సరవపు భైరవమూర్తి, కిషోర్‌బాబు, వి.చిరంజీవి, లంక శ్రీను, సవరపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కళా వెంకట్రావు జయంతి

అమలాపురం టౌన్, జూలై 7: కోనసీమతో పాటు రాష్ట్రానికి ఎనలేని సేవలు అందించిన ఘనత కళా వెంకట్రావుకు దక్కుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక భూపయ్య అగ్రహారంలోని అమ్మమ్మ యోగా శిక్షణా కేంద్రం వద్ద కళావెంకట్రావు జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి ఆయన మనుమడు కళా వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా వెంకట్రావు చిత్రపటానికి డాక్టర్ పీఎస్ శర్మతో పాటు పలువురు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బోనం సత్యవరప్రసాద్, గోటేటి గంగాధరరావు, పుత్సా కృష్ణకామేశ్వర్, యర్రమిల్లి అనంతలక్ష్మి, శ్రీగిరి పద్మావతి, గోపాలకృష్ణ, పోలిశెట్టి అనంతలక్ష్మి, పేరి లక్ష్మీనరసింహం, సప్పా నాగేశ్వరరావు, గోటేటి లక్ష్మి, వలవల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి నేత కళా వెంకట్రావు జయంతిని పలివెల మహాత్మాగాంధీ అధ్యయన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు దుళ్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కళా వెంకట్రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మద్రాసు రాష్ట్ర అసెంబ్లీలో జమీందారీ రద్దు బిల్లును ప్రవేశపెట్టి చట్టం చేయించిన ఘనత కళా వెంకట్రావుకే దక్కుతుందన్నారు. కోనసీమ అభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో భమిడిపాటి లక్ష్మీనారాయణ, గోపాల భాస్కరరామం, గొలకోటి శ్రీనివాస్, నాగేంద్ర, రాయుడు గోపి, ఆర్.మాధవ్, సుందర నీడి దొరబాబు, పింద్రాళ్ల శ్రీనివాస్, ఎంకే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానం అమలుకు కృషి చేయాలి

కపిలేశ్వరపురం, జూలై 7: ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసేందుకు అధికారులు కృషిచేయాలని రామచంద్రపురం ఆర్డీవో ఎస్.సుధాసాగర్ అన్నారు. ఆదివారం కపిలేశ్వరపురం, తాతపూడి వద్ద ఉన్న రెండు ఇసుక స్టాక్ పాయింట్లను ఆయన పరిశీలించారు. సోమవారం నుంచి ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు కొత్త శాండ్ పాలసీ మేరకు ఇళ్ల నిర్మాణాలకు ఇసుకను అందిస్తామన్నారు. వాహనాలు వచ్చి వెళ్లేందుకు, బార్‌కేడింగ్ తదితర పనులు జరుగుతున్నాయన్నారు. స్థానికంగా లోడింగ్ చేయడం, ట్రాన్స్‌పోర్ట్ కోసం ఏజెన్సీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా స్థాయిలో శాండ్‌కమిటీ చార్జీలు నిర్ణయిస్తుందన్నారు. ఉదయం6 నుంచి సాయంత్రం 6వరకు ఇసుక సరఫరా చేస్తామన్నారు. ఇసుక నిల్వ కేంద్రాలు సీసీకెమెరాల నిఘాలో ఉంటాయన్నారు. నిల్వ కేంద్రాల వద్ద రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తహసీల్దార్ రాజ రాజేశ్వరి, ఆర్అండ్‌బీ డీఈసూర్యనారాయణ, ద్రాక్షారామ, మండపేట ఏఈలు కిషోర్‌కుమార్, పణిలింగేశ్వరరావు, ఆర్ఐ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏఈ సలీంరాజు, వీఆ ర్వోలు శ్రీనివాసరావు, జాన్, ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


కపిలేశ్వరపురం స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో సుధాసాగర్

శోక సంద్రంలో షియా ముస్లింలు



అమలాపురం టౌన్, జూలై 7: షియా ముస్లింల ఆరాధ్య దైవమైన మహ్మద్ ప్రవక్త మనుమడు ఇమామ్ హుస్సేన్‌ను కర్బలాలో అతి క్రూరంగా వధించిన రోజులను పురస్కరించుకుని పట్టణంలోని 12వ వార్డు ముజాఫర్ సందులో అబ్బాసియా పంజా వద్ద ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన షియా ముస్లింలు అక్కడకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం నెలవంక చూసిన తర్వాత ఉత్తరప్రదేశ్‌కు చెందిన మతగురువు సయ్యద్ షబ్బర్‌హసన్‌జైదీ శాంతి సందేశం ఇచ్చారు. పంజా ధర్మకర్త మహ్మద్ నిస్సార్ హుస్సేన్, కార్యదర్శి కర్రార్ హుస్సేన్, మహ్మద్ చాంద్‌బాషా, అబ్బాస్, అలీ, కర్రార్, జాఫర్ పాల్గొన్నారు.

← యాత్ర నిర్వహిస్తున్న షియా ముస్లింలు

మంత్రి సుభాష్‌ను కలిసిన మెట్రోకెమ్ అధినేత



అమలాపురం టౌన్, జూలై 7: మెట్రోకెమ్ అధినేత నండెపు వెంకటేశ్వరరావు ఆదివారం కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు. ఆయన వెంట గంధం పల్లంరాజు, చిక్కాల గణేష్, డేగల సతీష్ పాల్గొన్నారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వైసీపీ పాలనలో స్థానిక సంస్థల్లో జరిగిన నష్టాలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు.

అందరిలోనూ దైవత్వాన్ని చూసిన మలయాళ స్వామి

అమలాపురం టౌన్, జూలై 7: అందరిలోను, అన్నింటా దైవాన్ని చూసిన మహనీయుడు మలయాళ స్వామి అని వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీపరిపూర్ణానందగిరి తెలిపారు. వేదాలు, ఆధ్యాత్మిక శాస్త్రాలు నిర్దిష్ట వర్గానికి మాత్రమే అన్న అపోహను తొలగించి అన్ని వర్గాల వారికి సంస్కృతం నేర్పించి అందరికీ దైవజ్ఞానాన్ని అందించిన ఘనత మలయాళ స్వామికి దక్కుతుందన్నారు. ఆయన ఏర్పాటుచేసిన వ్యాసాశ్రమం పీఠాధిపతిగా దేశమంతా సంచరిస్తున్నానని వివరించారు. అమలాపురం విద్యుత్ నగర్‌లోని ఆదిశేషా నిలయంలో జరుగుతున్న వారాహి నవరాత్రి పూజా మహోత్సవాల్లో పాల్గొనేందుకు ఆదివారం వచ్చిన ఆయన వ్యాసాశ్రమం విశిష్టతను, సన్యాశ్రమ విధివిధానాలను వివరించారు. భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. కార్యక్రమంలో శ్రీగౌతమహర్షి అక్షయపాత్ర ప్రతినిధులు పోతురాజు రామకృష్ణ-నాగకనకదుర్గ, చాగంటి ప్రసాద్-నాగకనకదుర్గ (నందు), తూముదొరబాబు, పరసా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆదరణ మరువలేను: బండారు

ఆలమూరు, జూలై 7: ప్రజల ఆదరణ మరువలేనని, వారికి జీవితాంతం రుణపడి ఉంటానని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పెనికేరు, నవాబుపేటల్లో ఆదివారం కూటమి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, పెనికేరు, నవాబుపేట గ్రామాల్లో ఎన్నికల్లో కీలకపాత్ర పోషించిన ఈదర చినబాబులకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. వారిని పుష్పమాలలతో ముంచెత్తి బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: కల్కి 2898 ఏడీ
శ్రీలలిత	: మహారాజ
శేఖర్ స్ర్కీన్-1	: కల్కి 2898 ఏడీ
శేఖర్ స్ర్కీన్-2	: కల్కి 2898 ఏడీ
రమా	: ప్రభుత్వ జూనియర్ కళాశాల
గణపతి	: హరోం హర
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: కల్కి 2898
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: కల్కి 2898 ఏడీ

నిత్యాన్నదానానికి రూ.10,116 విరాళం

మామిడికుదురు, జూలై 7: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి పెదపట్నంలంకకు చెందిన కొమ్ముల జగ్గారావు జ్ఞాపకార్థం ఆయన భార్య కొమ్ముల వెంకటలక్ష్మి మంగతాయారు రూ.10,116ను విరాళం అందించారు. దాతకు ఆలయ ముఖ్య తనిఖీదారు బి.సత్యంమూర్తి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

రంగా విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

ద్రాక్షారామ, జూలై 7: అన్నాయిపేటలో వంగవీటి మోహనరంగా విగ్రహ ఏర్పాటుకు ఆదివారం ఉదయం అమృతవర్ష ఆసుపత్రి వైద్యులు, టీడీపీ నాయకుడు డాక్టర్ ఎం.రాంబాబు, జడ్పీ మాజీ వైస్‌ఛైర్మన్ చింతపల్లి వీరభద్రరావు భూమి పూజ నిర్వహించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినం రోజున రంగా విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాధా రంగా మిత్రమండలి సభ్యులు, జనసైనికులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 7: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామంలోని అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో ఆదివారం బాయిలర్ పేలడంతో గాయపడిని కార్మికులకు మెరుగైన సేవలందించాలని కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశించారు. ప్రమాదంపై మంత్రి ఫోన్‌లో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదఘటనపై నివేదిక సమర్పించాలని కార్మికశాఖ అధికారులను ఆదేశించారు

రైస్‌మిల్లర్స్ ఆధ్వర్యంలో వేగుళ్లకు సన్మానం

మండపేట, జూలై 7: స్థానిక రైస్‌మిల్లర్స్ భవనంలో ఆదివారం ఆలమూరు తాలుకా రైసుమిల్లర్సు సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును రైస్‌మిల్లర్లు, సంఘ నేతలు సత్కరించారు. రైసుమిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, సంఘ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్యచౌదరి, మాజీ అధ్యక్షుడు చుండ్రువి.విసత్యనారాయణ, మాధవిబాబు, ఎన్.వి.వి.సత్యనారాయణరెడ్డి (అబ్బు) వల్లూరి వెంకట్రావు, మేడపాటి రామలిం గారెడ్డి, కోనగళ్ల సత్తిపండు, నెక్కంటి శ్రీరామ్‌జీ, హరిబాబు, నల్లమిల్లి వెంకటకృష్ణారెడ్డి,మిల్లర్లు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేక చట్టాలు

అమలాపురంటౌన్, జూలై7:సీనియర్ సిటిజన్ల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని ప్రముఖ న్యాయవాది నల్లా రవికుమార్ వివరించారు. అమలాపురం వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎస్‌కేబీఆర్ కళాశాలలోసర్వసభ్య సమావేశం నిర్వహించారు. న్యాయవాది రవికుమార్ అనేకఅంశాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. క్లబ్‌తరపున ఆయన్ను సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, కార్యదర్శి వలవల వెంకటరెడ్డినాయుడు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటం పెట్టాలి

మలికిపురం, జూలై 7: ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని కేశనపల్లిలో జరిగిన బీజేపీ సమావేశం డిమాండు చేసింది. ఆదివారం అడబాల రాంబాబు ఇంటి వద్ద కె.కనకేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ మాట్లాడుతూ జగన్ పాలనలో అభివృద్ధి కుంటు పడిందన్నారు. అనేక కేంద్ర పథకాలకు మ్యాచింగ్ గ్రాంటు ఇవ్వకపోవడంతో రైల్వే ప్రాజెక్టులు, జలజీవన్ మిషన్ పనులు, ప్రధానమంత్రి ఆవాస్‌యోజన రోడ్లు నిలిచిపోయాయన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వాటికి వెంటనే నిధులు విడుదలచేసి తీర్మానాలు చేపట్టాలన్నారు. సమావేశంలో అడబాల నరసింహారావు, అడబాల రాంబాబు, వెంకన్నబాబు, రేకపల్లి కనకం పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ స్ఫూర్తితోనే క్యాంటీన్లు

అంబాజీపేట, జూలై 7: పేదల ఆకలి తీర్చేందుకు డొక్కా సీతమ్మ క్యాంటీన్లు ఏర్పాటుచేయనున్నట్టు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రకటించడం హర్షణీయమని కోనసీమ ఆహార నిధి అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ అన్నారు. ఇరుసుమండలో ఆదివారం కోనసీమ ఆహార నిధి బృందం డొక్కా సీతమ్మ ఐదవ తరం వారసుడితో అభినందన కార్యక్రమం నిర్వహించారు. లంకల గన్నవరంలోని డొక్కా సీతమ్మ ఇంటిని సందర్శించి అక్విడెట్ వద్ద ఉన్న ఆమె విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఇరుసుమండలో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఆహారనిధి సభ్యులు జి.వీరు, బండారు సురేష్, పొలిశెట్టి పవన్, రంకిరెడ్డి పండు, బ్రహ్మాజీ, శ్రీనివాస్, చీకట్ల కిరణ్, ఆర్‌కే నాయుడుపాల్గొన్నారు.

బోధనాసామర్థ్యం పెంపునకు వర్కుషాపు దోహదం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 7: ఉపాధ్యాయుల్లో బోధనాసామర్థ్యం పెంపునకు, విద్యార్థుల్లో భౌతికశాస్త్రం పట్ల ఆసక్తి పెంపొందించడానికి వర్కుషాపులు దోహదం చేస్తాయని రేవతి సైన్సు ఫౌండేషన్ అధ్యక్షుడు కె.శ్రీకృష్ణసాయి అన్నారు. ఆదివారం పదో తరగతి నూతన భౌతికశాస్త్ర పాఠ్య పుస్తకంపై రేవతి సైన్సు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామచంద్రపురంలో వర్కుషాపు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి 50మంది భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రసాయన చర్యలు సమీకరణాలు, ఆమ్లాలు, క్షారాలు లవణాలు, లోహాలు, అలోహాలు, కర్బన సమ్మేళనాలు, కాంతి విద్యుత్, విద్యుత్ అయస్కాంతత్వం వంటి పాఠ్యాంశ ప్రయోగాలు ఉపాధ్యాయులతో చేయించారు.ఫౌండేషన్ కార్యదర్శి బి.శ్రీనివాస్, రామానుజన్ గణిత అకాడమీ అధ్యక్షుడు కె.వి.సత్యనారాయణ, కోనసీమ జిల్లా ఫిజికల్ సైన్సు ఫోరం అధ్యక్షుడు బి.ఎస్.ఎన్ మూర్తి, వివిధ ప్రాంతాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో రజకులకు అవకాశం కల్పించాలి

ముమ్మిడివరం, జూలై 7: నామినేటెడ్ పదవుల్లో రజకులకు అవకాశం కల్పించాలని ముమ్మిడివరం మండలం రజక సమావేశం డిమాండు చేసింది. ముమ్మిడివరంలో ఆదివారం ముమ్మిడివరపు రాంబాబు అధ్యక్షతన మండల రజక సమావేశం జరిగింది. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి విజయానికి రజకులంతా విశేష కృషిచేసి పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండు చేశారు. సమావేశంలో కేశనకుర్తి సుబ్రహ్మణ్యం, కేశనకుర్తి సురేష్, నడవపల్లి వీరవెంకటసత్యనారాయణ, కమిడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

రాయవరం, జూలై 7: వెంటూరులో రూ.20లక్షలతో నిర్మించనున్న మల్టీపర్పస్ ఆక్టివిటీ సెంటర్ నిర్మాణానికి ఆదివారం ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు భూమిపూజ చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, మాజీ సర్పంచ్ రిమ్మలపూడి వేణుగోపాలదొర, దేవళ్ల వెంకట్రావు, పోతుల వీర్రాజు చౌదరి, కొప్పిశెట్టి మాధవరావు, దొమ్మేటి శ్రీనివాసు, మేటిశెట్టి రాంబాబు, శ్రీను, వాసంశెట్టి శివప్రసాద్, చిరట్ల సుబ్బారావు, చెల్లబోయిన శ్రీనివాస్, మేడిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మండపేట, జూలై7: విద్యుత్‌లైన్ల మరమ్మతుల నేపథ్యంలోమండపేటలో సోమవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం ఐదు గంటలవరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. కేపీరోడ్డు, స్టేట్‌బ్యాంకు, తర్వాణీపేట, బూరుగుంటచేరువు, రథంగుడి, పెద్దకాల్వ, విజయలక్ష్మీనగర్, ఆలమూరు రోడ్డు, మెహర్ ఆశ్రమం తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

అన్నప్రసాద ట్రస్టుకు రూ.లక్ష విరాళం

అయినవిల్లి, జూలై7: కేశనకుర్రుపాలేనికి చెందిన ఇందుకూరి శ్రీనివాసరాజు కుటుంబ సమేతంగా ఆదివారం స్వామివార్ని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. అన్నప్రసాద ట్రస్టుకు రూ.లక్ష విరాళం అందించారు.

మహిళ మెడలో పుస్తెల తాడు అపహరణ

అంబాజీపేట, జూలై 7: గుర్తుతెలియని వ్యక్తి ఇద్దరు మహిళ మెడలో పుస్తెలతాడు అపహరించాడు. గంగలకుర్రు అగ్రహారం పరిధిలోని పీర్నాయిపాలేనికి చెందిన శీలం వెంకటలక్ష్మి ఇంటి ఆవరణలో ప్రధాన రహదారి పక్కన డ్రింక్ షాపు నిర్వహిస్తోంది. శనివారం రాత్రి ఏడు గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు మోటార్‌సైకిల్‌పై వచ్చి వాటర్‌ప్యాకెట్టు, డ్రింక్ బాటిల్ ఇవ్వమని అడిగారు. దీంతో ఆమె డ్రింక్ బాటిల్ ఇస్తుండగా ఒక వ్యక్తి ఆ మహిళ మెడలో ఉన్న బంగారు తాడును లాక్కుని పరారయ్యాడు. ఆమె అంబాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

విలువల గల నాయకుడు ఎమ్మెల్యే దాట్ల

ఐ.పోలవరం, జూలై 7: రాజకీయాల్లో విలువలతో కూడిన నేత ఎమ్మెల్యే దాట్ల సుబ్బారాజు(బుచ్చిబాబు) అని పలువురు నేతలు కొనియాడారు. పశువుల్లంకలో ఆదివారం బుచ్చిబాబు పర్యటించారు. స్థానిక నేత దూళిపూడి చక్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బుచ్చిబాబు మాట్లాడారు. ముమ్మిడివరం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానన్నారు. అనంతరం బుచ్చిబాబును ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. తొలుత గ్రామదేవత మాణిక్యాంబఅమ్మవారిని దర్శించుకుని మురమళ్ల నుంచి ర్యాలీగా పశువుల్లంకకు చేరుకున్నారు. తాళ్లరేవు మండలానికి చెందిన జనసేన టీడీపీ శ్రేణులు బుచ్చిబాబుకు సైకిల్, గ్లాసును అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొలకోటి దొరబాబు, ఎం.గంగసూర్యనారాయణ, పెనుమత్స రాజు, నాగరాజు సూరిబాబు, రాజు, తాడి నరసింహరావు, చెల్లి అశోక్, దాట్ల పృథ్వీ, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, గాదిరాజు బుచ్చికృష్ణంరాజు, అర్థాడి శ్రీనివాస్, కటారి నాని చోడిశెట్టి బ్రహ్మానందం, కోళ్ల భద్రం, కడియం తమ్మయ్య, గోదాశి పుండరీష్, మద్దింశెట్టి పురుషోత్తం, కొండమూరి విజయబాబు, సాధనాల త్రిమూర్తులు, సలాది శేషారావు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్స్ సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 7: ప్రైవేట్ స్కూల్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం రామచంద్రపురం జోన్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు మంత్రి సుభాష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి సుభాష్‌కు ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రైవేట్ స్కూళ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దొడ్డా సత్తిబాబు, గౌరవ అధ్యక్షుడు లయన్ జి.వి.రావు, నియోజకవర్గ అధ్యక్షుడు గుబ్బల రాంబాబు, పట్టణ అధ్యక్షుడు సన్‌షైన్ సురేష్, గిరీష్‌ప్రభు, శ్రీకాంత్, బాబు, విజయకుమార్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నాణేలతో తులాభారం



ఆత్రేయపురం, జూలై7: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో టీడీపీ సీనియర్ నాయకుడు సయ్యపురాజు కాశీవిశ్వనాథరాజు మనుమరాలు అద్యకు రూపాయి నాణేలతో తులాభారం నిర్వహించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,75,149 వచ్చినట్టు ఉప కులపతి, ఈవో భూపతి రాజు కిషోర్‌కుమార్ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

మొక్కు తీర్చుకునేందుకు గౌరీపట్నం పాదయాత్ర

రావులపాలెం, జూలై 7: ఎమ్మెల్యేగా బండారు సత్యానందరావు విజయం సాధించడం, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే గౌరీపట్నం పాదయాత్రగా వచ్చి మేరీమాత దర్శనం చేసుకుంటామని ఆ యువకులు మొక్కుకున్నారు. యార్లగడ్డ వెంకటేష్, కొమ్మరి నాగరాజు, చిన్న(గబ్బర్‌సింగ్), సురేష్, విజయ్, రాజేష్(మునలయ్య) గౌరీపట్నం పాదయాత్రగా తరలివెళ్లారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ఐ.పోలవరం, జూలై7: పశువుల్లంకలోఆదివారం కేంద్ర ప్రభుత్వ నిధులు రూ26.40లక్షలతో చేపట్టిన మంచి నీటి పథకానికి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, సర్పంచ్ నఖిలే పెద్దిరాజు, ఉపసర్పంచ్ గోపిశెట్టి వేంకటేశ్వరరావు, దులిపూడి త్రిమూర్తులు, దూళిపూడి మణికంఠ పాల్గొన్నారు.